# పశ్చాత్తాపం

## గంటి వెంకటరమణ

కుప్పుస్వామి వంటింట్లోకి వెళ్ళి పీటమీద మెల్లిగా చతికిలపడ్డాడు. భార్య రాజం ఇటు చూసి మళ్ళీ వంటలోకి జారిపోయింది. గంపెడు సంతానాన్ని ప్రపంచంలోకి జార్చేసి తను దిగకుళ్ళిపోతూ నానాటికీ క్షీణించిపోతున్న రాజంవైపు సానుభూతిగా చూశాడు కుప్పుస్వామి.

"ఇటు చూడు రాజం." గొంతు సవరించుకున్నాడు కుప్పుస్వామి.

"చూశానుగా. ఇంకేముంది చూసేందుకు? పాతికేళ్ళ నించి చూస్తూనే ఉన్నాను గొర్రెతోకనీ, మిమ్మల్నీ!"

"సంతోషమైన విషయం చెప్పదల్చుకున్నానోయ్!"

"చాల్లెండి వేళాకోళం! మీరుచెప్పే సంతోషమైన విషయం నాకు తెలీనిది కాదు. . ."

గొల్లున నవ్వాడు కుప్పుస్వామి భార్యమాటలకి అడ్డు తగులుతూ. రాజం గరిట చేతిలో ఉంచుకుని ఎడంచేతిని నడుముకి చేర్చి విచిత్రంగా చూసింది భర్తవైపు, ఎందుకంటే కాపరానికి కాలుమోపిన దగ్గిరనించి కుప్పుస్వామి ఇంత ఘనంగా ఏనాడూ నవ్వలేదు కనక. సంతానాన్ని ఇవ్వడంలో ఏమరుపాటు పొందలేదు పైనున్న భగవంతుడు. వాలీ చాలని జీతంతో ఇన్నేళ్ళు నెట్టుకువస్తున్న క్లార్కు కుప్పుస్వామిమీద ఏ ఒక్కళ్ళూ జాలి పడలేదు. ఇరవైనాలుగు సంవత్సరాల క్రితం తూర్పుగోదావరిజిల్లాలో ఏదో హైస్కూల్లో చదివేరోజుల్లో అతనితెలివితేటలుచూసి మాష్టర్లందరూ ముక్కులమీద వేళ్ళు వేసుకుని అతని మెదడు ఇన్స్యూర్ చేయిస్తే నష్టం లేదనుకున్నారు. మొదట్లో బాంక్‌లో ఇంటర్వ్యూకి పిలిస్తే ముఖ్యంగా అతని చేతిరాతను చూసే సెలక్టు చేసుకున్నారు. చేతిరాతకన్నా అతని బుర్ర పదునుగా ఉందని గ్రహించాడు ఆ రోజుల్లో ఉన్న వృద్ధుడు ఏజంటు.

సరే కాలం గడిచిపోయింది. ఇన్నేళ్ళవరకూ అతను నవ్విన పాపాన పోలేదు. బాంకులో గుమాస్తాగా మిగిలి పోయాడు. కుప్పుస్వామిలో ఉన్న ఒకే ఒక చిన్న దుర్గుణంవల్ల అందరికీ లోకువైపోయాడు. రాజం కుళ్ళికుళ్ళి ఏడవడానికి కారణం కుప్పుస్వామి పేకాటకి బానిస అయిపోవడం.

"ఇంతకీ ఎందుకు నవ్వుతున్నారు?" తెప్పరిల్లి తేరుకుని అడిగింది రాజం.

> పశ్చాత్తాపం అగ్నిలాటిది. బంగారంలోని కల్మషాన్ని అగ్ని పొగొట్టి శుద్ధి చేసినట్లే, పశ్చాత్తాపం మనిషిలోని కల్మషాన్ని పొగొట్టి మనసులు శుద్ధి చేస్తుంది. పవిత్రమైన ఆత్మ గలవారిని అధికారాలు, హోదాలు మలినపరచ లేవు. నిప్పుకు ఎప్పుడు చెద పట్టదు గదా!

"నేను ఆఫీసర్ని. . . అంటే జూనియర్‌ఆఫీసర్‌ని అయ్యాను రాజం. . ." సంతోషం పట్టలేక నిలబడిన భార్య వెనకగా వచ్చి ఆవిడ భుజంమీద చేతులువేసి అంటూంటే అతని కళ్ళముందు తల్లికోరిక ప్రత్యక్షం అయింది. ఈ అంతస్తు చూడకుండానే ఆవిడ కన్ను మూసేసింది. ఆ కళ్లలో అస్పష్టంగా కన్నీరు మెదిలి, దానంతట అదే లోపలికి వెళ్ళిపోయింది.

రాజం భర్త తల ఆప్యాయంగా గుండెలకి అదుముకుని నిశ్శబ్దంగా ఉండిపోయింది.

* * *

కుప్పుస్వామి మూడేళ్ళు దొర్లించాడు కాలచక్రంలో. నిజానికి అతను చదివింది స్కూలుఫైనలే. చిన్న ఆఫీసులో అతనికన్నా వెనక ప్రవేశించినవారు గ్రాడ్యుయేట్లు అయిపోయారు. ముఖ్యంగా అందులో ఆచారి ఒకడు. ఆచారి మొదటిరోజునించీ కుప్పుస్వామి మీద కడుపులో ద్వేషాన్ని నింపుకుని, దాన్ని దినదినానికీ పెంచి పెద్దదిగా చేస్తూ ఆఖరికి పొట్ట పగిలిపోయే స్థితిలో హెడ్డాఫీసు కింది ఆఫీసు ఏజెంటుకి రకరకాల రిపోర్టులు ఇచ్చాడు. పేకాడుతున్నాడనీ, తాగుతున్నాడనీ, తిరుగుతున్నాడనీ ఇలా ఓదాని తరవాత మరొకటి అంచ లంచలుగా చీఫ్‌ఏజంటు ఉత్తరాల్ని అందుకుంటున్నాడు. కడుపులో పెరిగిన ద్వేషం తాలూకు డైరీ కాగితాలని పాపం ఏజెంటు గ్రహించలేకపోయాడు. గొంతులో గరళాన్ని నింపుకుని ఈ కాగితాలమీద కక్కేస్తున్నాడనీ అనుకోలేకపోయాడు.

కుప్పుస్వామిని చాలా దూరంగా, నా అనేవాళ్ళకు అందుబాటులో లేనంత దూరంగా విసిరేశాడు. కుప్పుస్వామి తల్లడిల్లిపోయాడు. రాజం ఓదార్చి పంపించింది భర్తని. పిల్లల్ని భార్యనీ ఉన్నవూళ్లోనే వదిలేసి తను ప్రయాణం కట్టాడు.

ఏడాది దొర్లింది మళ్ళీ. పిల్లలు దారిద్ర్యబాధ అనుభవించడం కళ్ళారాచూసి చివరికి తనతోబాటు తీసుకుని వెళ్ళిపోయాడు కుప్పుస్వామి.

"జనరల్‌మేనేజరు వచ్చాడు." కుప్పుస్వామి భార్యతో అన్నాడు.

రాజం విచారంగా అంది: "ఏ మేనేజరువస్తే ఏం? మనకున్న బాధలు మనతోటే అంతమైపోతాయి. జనరల్‌మేనేజరు తాతవచ్చినా నాకూ, మీకూ సుఖపడే రాత లేదు."

"నేను అడిగి చూస్తాను రాజం. పిల్లల చదువు పాడైపోతూందనీ, ఇక్కడి వాతావరణం మనకి సరిపడ లేదనీ. . ."

"అందువల్ల ప్రయోజనం ఉంటుందంటారా?"

కుప్పుస్వామి నవ్వాడు జీవం లేనట్టుగా. "ప్రయత్నించడం వరకే మనవంతు. . . దైవం అనుకూలించాలి అంతే. . ." కుప్పుస్వామి కళ్ళముందు చీఫ్‌ఏజెంటు నవ్వు వినిపించింది.

"నువ్వు పేకాట ఆడడం నిజమేనా?"

"యస్ సర్."

"రాత్రింబవళ్ళు తెగ ఆడి బాంక్‌పని నిర్లక్ష్యం చేస్తున్నావట. ఈ రిపోర్టు ఎంతవరకూ నిజం?"

"అబద్ధం. శుద్ధఅబద్ధం. నేను రెగ్యులర్‌గా పని చేస్తున్నాను."

"తాగుతావట?"

"నో సర్. నేను ఇదివరకు పనిచేసిన షాపుల్నీ, హోటల్స్‌నీ, బార్స్‌నీ అడిగి తెలుసుకోండి. కుప్పుస్వామి జీవితంలో సారారుచి చూడనేలేదు. వాళ్లల్లో ఏ ఒక్క షాపుయజమాని చెప్పినా నమ్మండి.. కానీ. . కానీ రూమర్సు అంత దృష్టిలోకి తెచ్చుకోవద్దు సర్."

"రాత్రిళ్ళు. . ఎక్కడో గడుపుతున్నావట?"

కుప్పుస్వామిలో సహనం చచ్చిపోయింది. కోర్టులో ముద్దాయిని తలకిందులుచేసే ప్రాసిక్యూటర్‌లా ఉన్నాడు చీఫ్‌ఏజంటు. అరికాలిమంట శిరస్సు నంటుతూంది. శాంతాన్ని కొనితెచ్చుకుంటూ అన్నాడు: "యు కెన్ కన్సల్ట్ విత్ ఎ డాక్టర్."

"వ్వాట్!" చీఫ్‌ఏజెంటు గొంతు చిందులు తొక్కుతూంది.

"దట్ ... దట్ ఈజ్ ఇంపార్టెంట్ టు ది కమిటీ సర్." కుప్పుస్వామికి జీవితంమీదా, ఉద్యోగంమీదా కూడా ఆశలేదు. చివరిమాట అనేసి తల వంచుకున్నాడు.

"యస్ యు కెన్ గో." హుకుంజారీ చేసి మూడో రోజునే మనుష్యులకీ, అయినవాళ్ళకీ దూరంగా గిరవాటు వేశాడు. దీనిలో ముఖ్యపాత్ర ఆచారిదే అని కుప్పుస్వామి గ్రహించలేనంత చవట కాడు.

"పాపం సర్. మీ కుటుంబాన్ని ఇలా వేరుచేయడం ఆ ఏజెంటువల్లే జరిగింది. నేను అప్పుడప్పుడు చూస్తూ ఉంటాను. మీరు బెంగపెట్టుకోకండి." ఆచారి మాటల్లో అమృతం ఒలుకుతూంది.

రెప్ప వేయకుండా ఆ మొహంలోకి చూసి కుప్పుస్వామి అన్నాడు:

"నేనూ పిల్లలుగలవాణ్ణే. నాలాంటి పిల్లలతండ్రే నామీద ఇన్ని అభాండాలు వేసి మేనేజర్‌దృష్టిలోకి తీసుకువచ్చాడు. ఏజెంటు నన్ను తిట్టినపుడూ, నేను అవమానంతో బాధ పడుతున్నప్పుడూ, నా అంతరాత్మ నరకం అనుభవించింది. నా గుండెల్లో బాధ మనసులో మెదిలింది. తప్పకుండా ఇందుకు కారణం అయినవాడు అనుభవిస్తాడు."

ఆచారి మొహం నలుపురంగు పులుముకుంది. "మన ఆఫీసులో మీమీద అంత ద్వేషం ఎవరికుంది అంటారూ?" చిత్రంగా అడిగాడు.

గలగలా నవ్వేస్తూ అన్నాడు కుప్పుస్వామి: "చెప్పలేం ఎవరు గోముఖవ్యాఘ్రాలో."

"నామీద . . . మీకు నమ్మకం ఉందా సర్?" ఆచారి భుజాలు తడుముకున్నాడు.

"నా నమ్మకంతో మీకు పనేమిటి ఆచారిగారూ! ఇందుకు కారకుడెవరో నాకు పూర్తిగా తెలుసు. నేను తాగుతాను. నా ఇష్టం వచ్చినట్లు తందనాలాడుతాను. కానీ . . . ఇది ఎంతవరకూ నిజం? పోనీ ఈ రిపోర్టు ఇచ్చినవాడు గరిక కాల్చి నాలికమీద వాత పెట్టుకుంటున్నాడంటారా?"

"అయితే మన ఆఫీసులో బ్రాహ్మణుణ్ణి నేనే. నామీదే మీకు నమ్మకం లేనట్లుంది." కంగారు పడ్డాడు ఆచారి.

"నో ఆచారిగారూ. ఏదీ నిర్ధారణచేసి చెప్పలేను. వస్తాను. మీ అభిమానానికి థాంక్స్. నా స్థానంలో ఈ ఆఫీసుకు వచ్చినవాడు స్కూలుఫైనలు చదివితే మాత్రం అట్టేకాలం ఉండడు . . ." కుప్పుస్వామి బంగారుతునకలు మాట్లాడుతూంటే రైలుముందుకు

లాక్కుపోయింది.

"జనరల్ మేనేజర్ చాలా మంచివాడుట రాజం." కుప్పుస్వామి ఆలోచనలు మాని అన్నాడు ఎటో చూస్తూ.

"మంచిదేకదా! వీలు చూసుకుని కనుక్కోండి." రాజం కళ్ళు మెరిశాయి, మళ్ళీ స్వగ్రామం చేరుకోవాలనే ధ్యాస రాగానే.

కుప్పుస్వామి ఉత్సాహంగా ఈల వేసుకుంటూ ముందుకు నడిచాడు.

*　　*　　*

"సాయంత్రం ఏరోడ్రోమ్‌కి వస్తావనుకుంటాను. ఎలా ఉంది ఆఫీసువర్కు? నువ్వు కొత్తగా వచ్చావుట కదూ!" ఇంగ్లీషులో అడిగాడు నల్‌వాడే. మహారాష్ట్రుడు మహాదేవ నల్‌వాడేకి ఎవరన్నా ప్రేమే.

"సర్. .." కుప్పుస్వామి ప్రారంభించాడు.

నల్‌వాడే నిండని కుప్పుస్వామిలో ఏదో బాధ స్పష్టంగా మొహంమీద తాండవం ఆడటంతో ఆ నీళ్ళకి మించినట్లు కనిపించాడు.

"వ్వాట్?" అతి శాంతంగా అడిగాడు జనరల్ మేనేజర్.

కుప్పుస్వామి ధైర్యం తెచ్చుకున్నాడు. "నాకు ఈ ఊళ్ళో ఏదీ అనువుగా లేదు. పిల్లలకి చదువులేకుండా పోయింది. నా భార్యకి వాతావరణం పడలేదు. నేను ఈ బాంక్‌ను నమ్ముకుని గత పాతిక సంవత్సరాలుగా పని చేస్తున్నాను. ఇక్కడ నైట్‌కాలేజీ లేదు. నన్ను కనికరించి. . . పిల్లలుగలవాడిని. . ." ఇంక ఎక్కువగా మాగాలనిపించలేదు కుప్పుస్వామికి.

సర్వం అర్థం అయింది జనరల్ మేనేజర్‌కి. "నీకు ట్రాన్స్‌ఫర్ కావాలంటావ్. అంతేనా? వచ్చేనెల తపాలకి మంచి 'సిటీ'లో నిన్ను వేయిస్తాను.

"అన్నమాట నిలబెట్టుకుంటాను. నువ్వు బెంగ పెట్టుకోకు. మరి నేను డ్రెస్ చేసుకుని వస్తాను." జనరల్ మేనేజర్ లోపలికి వెళ్ళిపోయాడు.

*　　*　　*

చీఫ్ ఏజెంటు కిందే తనని వేశారని తెలిసి క్షణంలో గుండె ఆగినంత పనైంది కుప్పుస్వామికి. ధైర్యం తెచ్చుకుని డ్యూటీలో జాయిన్ అయేందుకు ప్రయాణం కట్టాడు.

*　　*　　*

"ఈ పల్లెగ్రాం ఇక్కడ పడేయమని నీకు చెప్పలేదు. వాళ్ళనీ వీళ్ళనీ ప్రాధేయపడి ఇక్కడ ప్రవేశించావు. నీ రోగం కుదరాలనే నేను అంతదూరం విసిరేశాను. నీకు తెలీదా ఇది త్వరగా డిస్పాచ్ చెయ్యాలని?" ఫోన్‌లో మండిపడుతున్నాడు చీఫ్ ఏజెంటు.

"ఈసారి శ్రద్ధగా చూసుకుంటాను సర్. ప్యూన్‌కి ఇచ్చి ఆ రోజే పంపాను. కానీ వాడు. . ."

"వాళ్ళ్ని మళ్ళీ మళ్ళీ కనుక్కోవలసిన బాధ్యత నీ మీద ఉంది. తెలుసా?"

"యస్ సర్."

ఫోను పెట్టేశాడు చీఫ్ ఏజెంట్.

*　　*　　*

సిటీలో డ్యూటీలో ఉన్నప్పుడు ఆ ఆఫీసర్ మీద ఏ ఒక్కరికీ ఇన్‌స్పెక్షన్ చేసే అధికారం లేదని తెలిసి ఎందుకు పెట్టాడో అర్థంకాలేదు కుప్పుస్వామికి. తనకి రోజులు బాగాలేవు. ఒకళ్ళని అని ఏం లాభం? ఏ క్షణాన ఆఫీసర్ అయ్యాడో ఆ రోజునించే శని పట్టుకుంది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి కుప్పుస్వామికి. చీఫ్‌ఏజెంటు త్రాచుపాములా వెన్నంటుతూనే ఉన్నాడు. ఎన్నేళ్ళిలా?

చీఫ్‌ఏజెంటు రావడం, చివాట్లు వేయడం అన్నీ రీలుమాదిరిగా తిరిగిపోయాయి. కుప్పుస్వామిమెదడు మొద్దుబారిపోలేదు. ఆలోచించి ఆలోచించి పదును ఎక్కింది.

*　　*　　*

ఓడలు బళ్ళూ, బళ్ళు ఓడలూ అయిపోయాయి. ప్రపంచంలో చాలా మార్పులు వచ్చాయి. అయినా రోజులు ఒకే మాదిరిగా ఉండిపోవు. కష్టాలు పరంపరలుగా అనుభవించిన ప్రతివాడూ దర్జాగా బ్రతికే కాలం వచ్చింది. భగవంతుడు అందరిపట్లా ఉన్నాడు.

కారులోనించి దిగగానే సెల్యూట్ చేశాడు గుమ్మంలో నించి బాంక్‌జవాను. ఇంట్లోకి పెద్దపెద్ద పాకెట్లని తీసుకువెళ్ళేందుకు ఇద్దరు నౌఖర్లు హాజరుగా నిలుచున్నారు. కారు డోరు వేసేందుకు మరొకరు.

పట్టుచీర కట్టుకుని అందంగా అలంకరించుకుని భర్తని చిరునవ్వుతో చూస్తోంది రాజం.

"నా కిప్పుడు టైము లేదు. మళ్ళీ వస్తాను. పిల్లలు స్కూలునించి రాగానే వాళ్ళని జీప్‌లో పంపించు. ప్లాజాలో ఏదో ఇంగ్లీషుపిక్చర్. వార్ అండ్ పీస్ అనుకుంటాను, దానికి."

"మరి?" రాజం ప్రశ్న మధ్యలోనే అందుకున్నాడు.

"మనం రవీంద్రభారతిలో డిఫెన్స్‌ఫండ్ కోసం ఏవో నాటకాలు వేస్తున్నారు. అక్కడికి వెడదాం." గాలిలో అంటున్నట్లు నాలుగు ముక్కలు అనేసి కార్లో కూర్చుని ముందుకు దూసుకుపోయాడు కుప్పుస్వామి. ఎమ్. కామ్. పాసై, బాంక్‌పరీక్షలు పాసై ఇప్పుడు అసిస్టెంట్ జనరల్ మేనేజరు అయ్యాడు.



(తరువాయి 43 వ పేజీలో)

యింతవరకు ఏమీ ఉద్యోగము దొరకలేదు. నాకు మనశ్శాంతి లేదు." — 'వడిగల ఎద్దులు కట్టుకు, మడిదున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ' అన్నారే నాడో! అవకాశా లెవరినీ పిలిచి పట్టం గట్టవు. వాటిని వెతుక్కుంటూ మనం వెళ్ళాలి. 'జాక్‌పాట్' పై వున్న గురి, స్వయంకృషిపై వుండకపోవడం ఈ శతాబ్దపు శాపం.

## ఎల్. ఎన్. ఆర్., ఇప్పిలి

"విజ్ఞానం అభివృద్ధి అగుచున్నకొలది, నాగరికత నవనవోన్మేషితమై చిగురించుచున్నకొలది, ప్రకృతిని మానవుడు జయించుచున్నకొలది నేటి మానవ సమాజంలో అనునిత్యం భయంతో, యాతనలతో మానవుడు ప్రశాంతత లేని జీవితం గడపవలసి వస్తున్నది. దీనికి కారణం యుగధర్మమా, లేక యింకేమైనా కలదా?" — అణువిచ్ఛేదంతో ఒక భయంకరశక్తికి వారసులమైనాము. ఆ శక్తిని కొన్ని అంతర్జాతీయ నిబంధనలతో కట్టడిలో వుంచేందుకు ప్రయత్నం జరుగుతున్నది. అణుపరిశోధనలకు సంబంధించిన ఒప్పందంపై ('మాక్లియర్ టెస్ట్ బాన్ ట్రీటీ') మిగతా దేశాలతోబాటు అమెరికా, రష్యాలు రెండూ చేవ్రాలుచేయడంతో ఒక ప్రమాదం కొంతమేర తప్పింది. కాని, వెంటనే చైనా ఉపద్రవం తలయెత్తింది. అంతర్జాతీయ రంగంలోని ఈ క్లిష్టపరిస్థితులే ఆయా దేశాలపై, దేశ ప్రజలపై, ఇది ఏకప్రపంచమవడంవల్ల, తమ ప్రభావాన్ని చూపుతున్నాయి. యూరప్‌లో ఆంగ్లేయులూ, ఫ్రెంచివారూ యుద్ధం నిలుపు చేశారనే వార్త కలకత్తాకోటకు అయిదునెలలకి గాని తెలిసే కాలం కాదాయె ఇది!

## కె. వి. యల్., గుత్తి

"కొంతమంది మనుష్యులు చూస్తేనే చాలు, వెంటనే పొగడేస్తుంటారు." — పొగడ్తకీ, మెచ్చుకోవడానికీ మధ్యగల వ్యత్యాసం చాలామందికి తెలియదు. మెప్పుని వ్యక్తపరిచేందుకు కొంచెం యోచన, తెలివి కావాలి. ఇంద్రుడులూ చంద్రుడులూ అని పొగడటం చాలా సులువు. మనవాళ్ళకి పొగడ్తలు అలవాటైపోయి ఎవరైనా విమర్శిస్తే, తిడుతున్నారనుకుంటారు.

## పి. యస్., చిలకలూరిపేట

"మనిషి విలువలు కొలిచేది డబ్బా, లేక మంచితనమా?" — డబ్బు హారతికర్పూరంలా హరించుకుపోవచ్చు. కాని, మంచితనం అనేది గంధపుచెక్కవంటిది.

## ఏ. యన్. టి., మహబూబ్‌నగర్

"నేను సెకండరీ గ్రేడు టీచరుని. పెళ్ళికి ముందు ఉద్యోగం చేయనిస్తాము అని, ఇప్పుడు ఉద్యోగం అక్కర్లేదని మొండిగా మాట్లాడుతున్నారు. ఆయన ఎల్. డి. సి. గా ఉద్యోగం చేస్తున్నారు. . . ఉద్యోగం వదిలి, రావలసిన వస్తువులు తీసుకొని, మీ నాన్నతో రమ్మని, వచ్చి, అత్తయ్యను క్షమార్పణ అడగమన్నారు. మా నాన్న తాను రానంటున్నారు. నన్నెందుకు ఉద్యోగం వదలమంటున్నారో అర్థంకావటంలేదు . . . , వేసవి సెలవులు గదా అని వెళ్ళితే, ఆ రాత్రికి రాత్రే నన్ను వెళ్ళిపొమ్మని, నీవు నా కనవసరమని చెప్పినారు . . . నా భర్త ఇంక మారరా? నేను చేసిన నేరమేమిటి?" — కనీసం ఆ ప్రశ్నతో మిమ్మల్ని మీరు తర్కించుకోగల శక్తి అయినా మీకు ఉన్నది. అదికూడా లేని అసంఖ్యాక అభాగినుల పవిత్ర భారతావని ఇది. సోదరీ, సంస్కార రీత్యా మీ రిద్దరూ చెరొక మెట్టుమీద ఉన్నారు. ఇప్పట్లో మీకు రాజీ కుదరదు. ఒకవేళ కుదిరినా, మిమ్మల్ని కించపరిచే షరతులమీదనే కుదురుతుంది. ఏ పరిస్థితిలోనూ ఉన్న ఉద్యోగాన్నిమాత్రం వదులుకోవద్దు. అదికూడా పోతే మీది 'బానిస బ్రతుకు' అవుతుంది. బహుశా, మీ నాన్నకూడా ఇదే మాట చెప్పి ఉంటారు.

## పి. జె. ఆర్., అవుతాపురం

"మంచి స్నేహితులు లభించటం భాగ్యాలన్నింటిలోకల్లా తలమానికం అని భావిస్తారు." — అందుకనే ఫ్రెంచివారంటారు: 'నీవు కలిసి భోంచేసే మిత్రునితో వ్యాపార సంబంధాలు పెట్టుకోకు' — అని. ఇప్పుడు అన్ని వ్యాపారాలు డైనింగ్ టేబుల్‌వద్దనే జరుగుతున్నాయనుకోండి — అది వేరే విషయం. ఈ భోజనాల బల్లకీ, కలిసి భోంచేయడానికీ చాలాదూరం ఉన్నది. మనసు విప్పి చెప్పుకోగల మైత్రి మంచి ముత్యాన్ని మించినది. కాని, అటువంటి స్నేహానుభూతి ఆనాటి కానాడు కరువవుతున్నది.

## వి. ఆర్. ఆర్., నాగపూర్

"మన ప్రమదావనముతో బాంధవ్యమున్న ప్రమదలంతా ఒక సంఘంగా ఏర్పడి, సోషల్ వర్క్ చేయకూడదూ?" — ఐడియా గొప్పదేగాని, ఆచరణలో అసాధ్యం. వారానికో రెండు మూడు గంటలు కాలక్షేపంతో కట్టివేసే బాంధవ్యం మనది. అదీగాక, ఈనాడు 'సోషల్ వర్క్' అనేది తన ఉన్నతాదర్శాన్ని కోల్పోయి, సాంఘిక హోదాలో ఒక భాగమయింది. ★

# పశ్చాత్తాపం

(35 వ పేజీ తరువాయి)

అబద్ధాన్ని సులభంగా మరొకళ్ళ నెత్తిమీద రుద్దగలం. "మనదాకా రావాలి ఏదైనా" అంటారు పెద్దలు. ఇందుకే కాబోలు.

"మీరు పేకాట ఆడుతున్నారట నిజమేనా?" పైపు వెలిగించాడు కుప్పుస్వామి.

"యస్ సర్."

రాత్రింబవళ్ళూ తిరుగుతూ, తాగుతూ, ఎక్కువ టైము వృథాగా గడుపుతూ బాంక్‌పనులు నిర్లక్ష్యం చేస్తున్నారట."

"అబద్ధం . . . శుద్ధఅబద్ధం." చీఫ్‌ఏజెంటు కుప్పుస్వామి దగ్గిర గడగడ లాడుతున్నాడు.

"మీరు బాంక్‌లో లోను తీసుకుని రేసుల్లో. . ." కుప్పుస్వామి వాక్యం పూర్తి కానివ్వలేదు ఏజెంటు.

"నామీద మీకెవరో కిట్టక చెప్పారు సర్!" కుప్పుస్వామి ఎదట నిలబడి ఏజెంటు బిక్కుబిక్కుమంటూ చూశాడు.

"దట్సాల్. . ."

"షల్ ఐ గో సర్?" అతి వినయంగా అడిగాడు, ఆనాడు కుప్పుస్వామిని నానా హింసా పెట్టి నరకాన్ని చూపించిన ఏజెంటు.

"నో. . ." కుప్పుస్వామి గంభీరంగా అన్నాడు. "మీరు వెళ్ళవద్దు."

అయోమయంగా చూశాడు ఏజెంటు.

"మీరు స్వతహాగా మంచివారు అవునో కాదో నాకు తెలియదు. మీ వ్యక్తిగతవిషయాలు నాకు అనవసరం. మీరు ఆ రోజు నన్ను ఇలాగే అడిగారు. నిజానికి పేకాట తప్ప నాకు మరే వ్యసనం లేదు. ఇటువంటి పిచ్చిపిచ్చి రిపోర్టు లెక్కచేసేవాణ్ణి కాను. . ." కుప్పుస్వామి ఈజీచైర్‌లోంచి లేచాడు. మెల్లిగా అడుగు ముందుకు వేసి ఏజెంటుచేతిని అందుకుని ఆ చేతిని ఆప్యాయంగా నొక్కుతూ "మీరు నాకు తండ్రిలాంటివారు. మనుష్యులు కిట్టకచేసే అన్యాయపనులు ఇవి. ఆరోజు పగ ఈ రోజు తీర్చుకుంటానని ఆచారి అనుకున్నాడు. ఆచారిని ఈ క్షణంలో ఉద్యోగంలోనుంచి తీసేయగలను నేను! కానీ గంపెడుసంతానం గల ఆచారిభార్య నాకు అపకారం చేయలేదు. ఆ సోదరి కంటతడి నాకు తగలడం ఇష్టంలేదు. నా మనసు పడిన క్షోభకి అప్పటినుంచీ ఆచారి అదే ఉద్యోగంలో స్థిరపడిపోయి ఆర్థికంగా దెబ్బతింటున్నాడు..." అని, "సర్! ఇప్పటికైనా మీరు నన్ను నమ్ముతారా?" అన్నాడు కుప్పుస్వామి మందహాసం చేస్తూ.

ఏజెంటు చాలా పెద్దవాడైపోయాడు. అతన్ని పశ్చాత్తాపం దహించివేస్తోంది. మనిషిలో మించిన మంచితనాన్ని చూస్తుంటే అవమానంతో కుంగిపోతున్నాడు. ఏమనుకున్నాడో ఏమో . . . హఠాత్తుగా కుప్పుస్వామిని గుండెలకి అదుముకుని "నన్ను క్షమించు!" అన్నాడు. మరో రెండేళ్ళలో రిటైర్ అవబోయే అతనికి ఆఫీసుతాలూకు బాంధవ్యం అడ్డు తగల్లేదు.

కుప్పుస్వామి కళ్ళు చెమర్చాయి. "మీరు . . . అంతమాట అనకండి. మిమ్మల్ని అలా ప్రశ్నలు వేసినందుకు పశ్చాత్తాపంగానే ఉంది నాకు. నేను మీ కొడుకులాంటివాడిని."

ఏజెంటు దూరంగా కదిలివెళ్ళాడు. వయసుమళ్ళిన అతన్ని చూస్తూ పైపు మునిపంటితో నొక్కుకుంటూ ఉంటే తన అంతస్తుకు కారకుడైన జనరల్‌మేనేజర్ గుర్తుకు వచ్చాడు. మంచివాళ్ళను భగవంతుడు అతి త్వరగా లాక్కుపోతాడు అంటారు! విదేశాలకి వెళ్ళబోతున్న అతనికి ఘనంగా సన్మానాలు జరిగాయి.

కానీ. . . మార్గమధ్యలో విమానం కూలిపోయి మనిషి శాశ్వతంగా దూరం అయిపోయాడు. 'అతను తనను గురించి చెప్పడంవల్లే ఈనాడు ఇంత హోదా, పలుకుబడీ వచ్చాయి. లేకపోతే...' కుప్పుస్వామి కళ్ళు మూసుకున్నాడు భక్తిగా.

* * *

గమనిక: ఇది ఏ బాంక్ గుమాస్తాకీ, ఏ ఏజెంటుకు, జనరల్‌మేనేజర్‌కీ సంబంధించినది కాదు. వట్టి కల్పిత కథ. ఆచారిలాంటివాళ్ళు భుజాలు తడుముకోవలసిన పనిలేదు! ★